



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -15-

*నా చూపులో కట్టుబడి, నీ చూపుని ఆపు. నీ చూపు కదిలిందా? నీ మనసు కదులుతుంది. నీ మనసు కదిలిందా ప్రపంచాలే కదులుతాయి.*

*యోచించు. ఆలోచించు. నీతో మాట్లాడే నేను ఎవరు? వినే నువ్వు ఎవరు? మనిద్దరి మధ్యా, మనల్ని వేరు చేసే ఈ లోకం ఎవరు? నీ కళ్ళలో నించి నిన్నూ, నన్నూ కలిపి చూసే కాంతి ఎవరు? నా మాటల్ని లోపలకి తీసుకునే శ్రోత ఎవరు? వీటన్నిటి వెనకా నుంచుని అనుభవిస్తున్నానని భ్రమింపజేసే జ్ఞానం ఎవరు?*

*ఈ లోకం ఇంతే. ఏ సత్యమూ లేని, దూరమూ, కాలమూ అనే పడుగు పేకలపై జ్ఞాన కాంతి మెరిపించే తళుకు రూపాలు. ఇదో బొమ్మలాట. ఇంత సేపూ తెర మీద దెబ్బలాడిన కర్ణార్జునులు కాల పేటికలో కావిలించుకొని పడుకున్నారు. గడచిన అనంతంలో మనం లేము. గడబోయే అనంతంలో వుండబోము. ఈ అగాధ ఆద్యంత రహిత శూన్యంలో ఒక్క క్షణం, ఒకే ఒక్క క్షణం ఈ నేను అనే మొహం.*

ఇవన్నీ చలం గారు అప్పుడప్పుడు తన రచనల్లో వెలిబుచ్చిన భావాలూ, లోతైన ఆలోచనలు నిండిన కవితాత్మక వాక్యాలు. రచనల్లో నిజాయితీ, ఊహల్లో నిజాయితీ, వాక్కులో నిజాయితీ, జీవితం పొడవునా నిజాయితీ. నిజాయితతో నిండిన నిఖార్సయిన రూపం చలం..... గుడిపాటి వెంకట చలం...!

చలం గారి రచనల గురించిన అంశాలలోనే తరువాత విశేషం ఏమిటంటే.. "చలం జీవితం–సాహిత్యం "అనే ప్రత్యేకమైన పుస్తకం రూపుదిద్దుకున్న విధానం. క్రిష్ణా జిల్లాలో 'ఘంటసాల' అనే గ్రామం వుంది. ఆ గ్రామంలో 1950 ప్రాంతాల్లో ఒకే పేరుతో ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వాళ్ళపేర్లు గొర్రెపాటి వెంకట సుబ్బయ్యలు. ఒకాయన్ని రైతు వెంకట సుబ్బయ్య అనీ, ఒకాయన్ని కవి వెంకటసుబ్బయ్య అనీ పిలిచేవారు. ఈ కవి గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు ఏ కళాశాల లోనూ పనిచేయలేదు గానీ, ఆయన సృష్టించిన సాహిత్యం ఏ విశ్వవిద్యాలయం phd పట్టాకైనా, అర్హమైన రచనలు అనేకం చేశారు. ఆ గ్రామంలో వుండే చేశారు. శరత్ గారి రచనల గురించి విశేషమైన కృషి చేసీ, పరిశోధన చేసీ "శరత్ దర్శనం"అనే పెద్ద పుస్తకం రాశారు. అదే సమయంలో అనేక మంది రచయతలతోటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్న క్రమంలోనే ఆయనకు చలం గారితో పరిచయం ఏర్పడి, చలంగారితో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవాడు. ఆయనకు చలంగారి జీవిత చరిత్ర గురించి ఏదైనా పుస్తకం రాస్తే బాగుంటుంది అనే ఆలోచన వచ్చి, అదే విషయాన్ని చలం గారితో చెప్పారు. అందుకు చలం గారు అంగీకరించి, అరుణా చలం రమ్మన్నారు.

ఈ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు 1957 ఫిబ్రవరి లో అరుణాచలం వెళ్లి, చలంగారి దగ్గర కూర్చొని, తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని చెప్పారు. " ఇంత వరకూ పాఠకులకు చలం గారి రచనలే గానీ, ఆ రచనలు చేయడానికి రగిలించిన సంగతులు ఎవరికీ తెలియవు. వాటిని సమగ్రంగా ఒక పుస్తకంగా రాద్దామని అనుకుంటున్నాను "అన్నారు. చలంగారు, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారి ప్రతిపాదనను అంగీకరించారు. అప్పటినుండి చలంగారూ, సౌరీస్ గారూ ఉదయం నుండి సాయంకాలం వరకు కూర్చొని కొన్ని వారాల పాటు తమ జీవితంలో జరిగిన సంఘటనలనన్నింటినీ విడతలు విడతలుగా చెప్పారు. ఆ తర్వాత ఆయన సుమారుగా 1959 లో ఈ "చలం జీవితం– సాహిత్యం"అనే టటువంటి ఒక గ్రంధాన్ని బయటకు తీసుకువచ్చారు.

ఆ పుస్తకంలో ఏం చేశారంటే, చలంగారి యొక్క స్వేచ్ఛా ప్రణయ వృత్తాంతాలు గానీ, ఏవైనా వివాదాలు అనిపించేటటువంటి అంశాలు చేర్చకుండా, చలంగారి జీవితాన్ని విహంగ వీక్షణంలా చూడడమూ, చలం గారి రచనలను సమీక్షలూ, చలం గారిని ఇతరులతో పోల్చడమూ, ఒక విద్యావేత్తగా, ఒక తండ్రిగా, ఒక ప్రియుడిగా, ఇలా వివిధ కోణాల్లో చలం గారిని చూడడం, చలం గారి అభిప్రాయాలూ.. ఇలాంటివన్నీ చేర్చారు. 1959 లో ఆ

పుస్తకాన్ని ప్రచురించే వరకూ చలం గారి వ్యక్తిగత జీవితం గురించి, ఆయన సన్నిహితులకు తప్పా, ఎక్కువగా బయటవాళ్ళకు తెలీదు. ఇవి చలంగారి రచనల గురించి 1950–60 మధ్యలో జరిగిన కొన్ని సంఘటనలు.

ఇంక చలం గారి ఆరోగ్యం గురించి. ఆయనకు 1957–58 వచ్చేసరికి, అంటే అరుణా చలం వెళ్లిన 5,6 సంవత్సరాలకే చూపు మందగించడం ప్రారంభించింది. మైగ్రేన్ తగ్గుతుంది అనుకున్నారు గానీ, అదలా కొనసాగుతూనే వుంది. కాళ్ళ నొప్పులు కొత్తగా వచ్చాయి. 1963 ప్రాంతాల్లో భగవద్గీతకు వాఖ్యానం రాశారు. అది రాసినప్పుడు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురయ్యారు, ఎన్నో పుస్తకాలు చదివి, వాటి వాఖ్యానాలన్నీ చూసి, వాటికి విభిన్నంగా ఉండేలా తన సొంతదైన వాఖ్యానం రాశారు. అది కొన్ని నెలల పాటు కొనసాగింది. ఆ క్రమంలోనే ఆయనకు రక్త పోటు రావడం ప్రారంభమయ్యింది..

భగవద్గీత రాయడం ప్రారంభించిన తరవాత సంవత్సరాల్లోనే చలం గారు ప్రకృతి వైద్యాలు ఎక్కువగా చేస్తుండేవారు. తెల్లవారుజామునే లేచి, బంక మన్నులో పడుకోవడం, ఎక్కడ నొప్పి అనిపిస్తే అక్కడ బంక మన్నుని ఒక మూటలాగా కట్టుకోవడం చేసేవారు. సీసాల్లో రంగు రంగు నీళ్లు పోసి,ఎండలో పెట్టి ఇలాంటివి ఏవో చేసి, తర్వాత వాటిని త్రాగడం. ఆయనకు వున్న రుగ్మతలు తగ్గుతాయనే నమ్మకం తో అలాంటివి చేసేవారు. ఇవి 1950 లో మొదలయ్యి, దాదాపు చిట్టచివరి వరకూ కొనసాగాయి.

ఈ రోజుల్లో కుటుంబ సభ్యులూ, సన్నిహితుల జీవితాలు ఎలా ఉన్నాయో చూద్దాం.

పెద్దమ్మాయి సౌరీస్. ఈమెకు 1951 లోనే ఈశ్వర దర్శనం అవ్వడం, అప్పటినుండి ఆమె ఏం మాట్లాడినా ఈశ్వరుడే మాట్లాడినట్లుగా చలంగారే కాదు, అతని అభిమానులూ భావించడం జరిగింది. చలం గారి రెండో అమ్మాయి నిర్మల. ఇంట్లో 'చే'అనేవారు. ఆమె చలం గారు అరుణాచలం రావడానికి ముందే మద్రాస్ వెళ్లిపోయిందనే సంగతి గతంలోనే తెలుసుకున్నాం. చలంగారు అరుణాచలం వచ్చాక, ఆమె మద్రాస్ నుండి వచ్చి , అతికొద్ది రోజులు అరుణా చలంలో ఉన్నారు. అక్కడ నుండి బొంబాయి వెళ్లి, అక్కడ వుద్యోగం చూసుకున్నారు. బహుశా అది ఇండియన్ ఎయిర్ లైన్స్ కావచ్చు. కానీ, అక్కడ కూడా ఎక్కువ కాలం వుద్యోగం చేయలేదు. మధ్యలో వుద్యోగం పోయి, అరుణాచలం వచ్చి, మళ్ళీ బొంబాయి వెళ్లారు. అప్పుడు 'కాల్ టెక్స్ ' లో చేరారు. అక్కడే చిట్టచివరి వరకూ ఉన్నారు.

ఆ 'కాల్ టెక్స్ 'లో పని చేస్తూ ఉండగానే, 'చిన్మయా మిషన్ 'వారితో పరిచయం అయింది. తరువాత 'స్వామి చిన్మయా నంద 'కు సహాయకురాలిగా చేరారు. బొంబాయిలో వుద్యోగం చేస్తున్న రోజుల్లోనే 'చిన్మయా నందా మిషన్ వారు చేస్తున్న చిన్న పిల్లల కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవారు. ఆ తరువాత సంవత్సరాలలో ఆవిడ జీవితంలోని చివరి 25 సంవత్సరాలూ కోయంబత్తూర్లోని 'చిన్మయా మిషన్'లోనే ఉన్నారు. అక్కడే కన్నుమూశారు. నిర్మల గారు

బొంబాయి లో వున్నన్ని రోజులూ ఆమె బాధ్యతగా తీసుకున్నది – అరుణా చలంలో చలంగారికి ఆర్థిక వనరుల్ని సమకూర్చడం. ఆమెకు వుద్యోగం వచ్చిన 1952–53 ప్రాంతాలనుండి చిట్టచివరి వరకూ కూడా వాళ్లకు కావాల్సిన సౌకర్యాలు అన్నీ కూడా నిర్మల గారే చూశారు.

అలాగే చలం గారు అప్పటివరకూ తాత్కాలికంగా అద్దెకు ఉంటున్న ఇళ్లను కొనేసి, సొంతం చేశారు. ప్రతి సంవత్సరం అరుణాచలం వెళ్లడం అక్కడ వున్న వాళ్లకు కొత్త బట్టలు తీసుకువెళ్లడం, ఎప్పుడైనా వెళ్లడం ఆలస్యం అయితే, వెళ్లడం కుదరక పోయినా పార్సిల్ ద్వారా కొత్త బట్టలు పంపించడం చేస్తుండేవారు. సౌరీస్ తన జీవిత చరిత్రలో రాసుకున్నారు కూడా "ఈ అరుణా చలం లో ఉన్నటువంటి చలం గారి కుటుంబానికి "చీఫ్ పాట్రన్ " ఈ నిర్మల. తను అన్నీ పంపిస్తూ, మా క్షేమ సమాచారాలు కనుక్కోవడం, ఆర్థిక పరమైన ఇబ్బందులు ఏమీ లేకుండా చూసుకున్నది ఈ నిర్మలే "అని.

తరువాత చలం గారు బెజవాడలో ఉండగా నెలల పాపగా పెంచుకున్న అమ్మాయి చిత్ర. చిత్రకి కూడా బెజవాడలో ఉండగానే పెళ్లి చేయడం, ఆమెకు ఒక పాప కూడా ఉందని గతంలోనే తెలుసుకున్నాం. అయితే, ఏదో కారణాల వాళ్ళ భర్తకు దూరంగా ఉంటోంది. చలంగారు అరుణా చలం వచ్చాక, చిత్ర తన పాపతో చలం గారితో వచ్చేసింది. కొన్ని సంవత్సరాలకి చిత్ర గారి భర్తా, అత్తగారు వచ్చి బ్రతిమిలాడి తీసుకువెళ్లారు. అలా భర్త దగ్గరకు వెళ్లి వస్తూ వుండేవారు. ఆశ్రమంలో వున్నప్పుడే చిత్ర గారికి మరో ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. డాలీ తర్వాత వరసగా అమ్మాయిల పేర్లు 'కాకా' , కిట్టూ, మిస్సీ. ఈ కిట్టూ అనే చిత్రాగారి మూడో అమ్మాయి మనకి చాలా సమాచారం అందించారు. ఈ కథనానికి విలువైన సమాచారాన్ని డైరెక్ట్ గా తెలుసుకోవడానికి ఆమె తోటి దాదాపు ప్రతి వారం మాట్లాడుతున్నాను. ఇది చిత్రా గారి యొక్క కుటుంబం.

ఆ తరువాత, చలం గారి మూడో అమ్మాయి చంపక. ఈమెను 'పకపక' అంటుండేవారు. ఈమెకు చలం గారు అరుణాచలం వచ్చేసమయానికి 15 ఏళ్ళు. ఆశ్రమంలో అందరితో పాటూ చిన్న పిల్లగా పెరుగుతూనేవున్నారు.

ఈ సందర్భంలో చలం గారి కుటుంబం సంగతులు ఇక్కడ ఆపి, మరొక వ్యక్తి గురించి తెలుసుకోవాలి. ఆ వ్యక్తి పేరు 'వజీర్ రహ్మాన్'. ఇతనిది కాకినాడ. కాకినాడలో 'ఇస్మాయిల్'అని ఒక కవి ఉండేవాడు. ఆయన తమ్ముడు ఈ 'వజీర్ రహ్మాన్'. మద్రాస్లో చదువు కుంటుండేవాడు. ఆయన చలం గారి సాహిత్యాన్ని చదివి ప్రేరణ పొంది, ఉత్తరాలు రాస్తూండేవాడు. ఉత్తరాలు రాయడమే కాకుండా అపుడప్పుడు అరుణా చలం కూడా వచ్చి వెళుతుండేవాడు. చలం గారి సాహిత్యాన్ని చదివిన తర్వాత, ఆ వజీర్ రహ్మాన్ కి ఒక ఆలోచన వచ్చింది. చలం గారి యొక్క వచనంలో అద్భుతమైన కవిత్వం వుంది. దీన్ని కొంచెంగా లైన్లను అటూ, ఇటూగా మారిస్తే, చక్కటి కవితల్లాగా ఉంటాయి అని. అలా అమర్చి 'కవిగా చలం' అనే పుస్తకాన్ని వెలువరించాడు 1955–56 ప్రాంతాల్లో.

అది చదివిన చలంగారు ”ఇది నేనే రాసానా? అని నేనే ఆశ్చర్య పోయాను “ అని మిత్రుడికి ఒక వుత్తరం లో రాశారు. ఆ పుస్తకంలో ‘చలం గారు, వజీర్ రహ్మాన్ ‘కి రాసిన ఉత్తరాలు కూడా జత చేయబడ్డాయి. ఆ తరువాత కొద్ది రోజులకి వజీర్ రహ్మాన్ అరుణాచలం వెళ్లి వస్తుండే క్రమంలో చంపకతో పరిచయమయ్యింది, ఆ పరిచయం వివాహ ప్రస్తావన వరకూ వెళ్ళింది. మరి చలం గారికి ఈ వివాహ వ్యవస్థ మీదే నమ్మకం లేదు. ఎలా ఒప్పుకున్నారు? అలా అని ఆయన నియంతృత్వం కూడా చూపించరు. కాబట్టీ, ఆయన ఏం సలహా ఇచ్చారంటే.. “వివాహ బంధం లోకి వెళ్ళవద్దు.”అన్నారు. కానీ, “చేసుకోవద్దు” అని బలవంతం చెయ్యలేదు. చంపక, వజీర్ రహ్మాన్ వివాహం చేసుకుందామని నిర్ణయించుకున్నాక, మరి సహజంగానే వాళ్ళ బాగోగులు చూస్తున్న నిర్మల గారికి తెలియజేశారు. 1959 మార్చి 16 న వివాహం చేసుకోవడానికి నిశ్చయించుకున్నారు. ఒక రోజు ముందుగా నిర్మల కొత్త బట్టలు తీసుకువచ్చారు. మార్చ్ 16 పొద్దున్నే ‘వేలూరు’కు వెళ్లి రిజిస్టర్ మేరేజి చేసుకున్నారు. ఆ పెళ్లి చేసుకొని వచ్చాక, చలం గారి ఇంట్లోనే అందర్నీ పిలిచి, భోజనాలు పెట్టారు.

ఈ వివాహం వలన తీవ్రంగా బాధ పడిన వ్యక్తి, తీవ్రంగా నిర్ణయం తీసుకున్న వ్యక్తి ఎవరంటే. చలంగారి భార్య రంగనాయకమ్మ గారు. ఎందుకు? మతాంతర వివాహం అనే కారణం తోటి. ఆ వివాహం చేసుకోవడం ఆవిడ భరించలేక బాధపడి అరుణాచలం నుండి వెళ్లిపోయారు.

ఈ విషయం చలంగారు ఒక మిత్రుడికి “రంగనాయకమ్మ గారు ఈ మధ్యనే వెళ్లిపోయారు. ఆవిడ కాకినాడలోనో, బెజవాడలోనే ఉండి ఉంటారు. మళ్ళా ఎప్పుడు వస్తారో కూడా తెలియదు.” అని వుత్తరం రాసారు. అలా వెళ్లిపోయిన రంగనాయకమ్మ గారు, కాకినాడలో ఎవరో స్నేహితురాలుకి ఒక స్వచ్చంద సేవా సంస్థ ఉంటే, అక్కడకు వెళ్లి ఆ సేవా సంస్థలో పని చెయ్యడం ప్రారంభించారు. చలం గారూ, నిర్మల గారూ ఆమెకు అవసరమైన డబ్బులు పంపిస్తుండేవారు. అలా వెళ్లిపోయిన రంగనాయకమ్మ గారు మరో 7 సంవత్సరాల పాటు మళ్ళీ అరుణాచలం రాలేదు.

ఇక మిగిలినది ‘నర్తకి’. ఈమె 10 సంవత్సరాల వయసులో చలంగారి కుటుంబంలోకి వచ్చింది. ఇప్పుడు ఆమె వయసు 25 సంవత్సరాలు ఉంటుంది. ఆశ్రమ నిర్వహణ అంతా ఆమే చూసుకుంటుంది. అలాగే చలం గారికి వ్యక్తిగత సహాయకురాలిగా కూడా ఉంటుంది. నర్తకికీ, చలం గారికీ ఉన్నటువంటి సంబంధం గురించి, సౌరీస్ తన జీవిత చరిత్రలో రాస్తూ... “వాళ్ళది ఒక విచిత్రమైనటువంటి, అనిర్వచనీయమైన అనుబంధం. చలం గారిని చూడకుండా నర్తకి వుండలేదు. నర్తకి లేకుండా చలంగారు ఉండలేరు. ఆ అనుబంధం చివరివరకూ అలాగే కొనసాగింది.” ఆమె జీవితాంతం అవివాహితగానే ఉండి పోయారు. మనం మాట్లాడుకునే సమయానికి 1950-62 మధ్యలో ఆమెకు ఒకసారి ‘లెప్రసీ’అంటే, కుష్టు వ్యాధి కూడా వచ్చింది. ఆ రోజుల్లో అది చాలా ప్రమాదకరమైన

వ్యాధి. కాకపోతే, ఆ ఆశ్రమం లో వున్నా వాళ్ళూ, ఆ చుట్టు పక్కల వాళ్ళూ ఇచ్చిన ఆయుర్వేదం, అల్లోపతి ఇలా రకరకాల మందుల వల్ల 2,3 సంవత్సరాల్లో ఆ కుష్ఠు వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. ఇవి చలం గారి కుటుంబ సభ్యుల గురించిన వివరాలు.

ఇద్దరు, ముగ్గురు మిత్రుల గురించిన వివరాలు తెలుసుకుందాం.. అసలు చలం గారిని మొదటిసారి అరుణాచలం తీసుకువచ్చింది చింతా దీక్షితులు గారు. రాజమండ్రిలో పరిచయం. ఆయన మాత్రం అరుణా చలం రాలేదు. అలాగే "సౌరీస్ కి ఈశ్వర దర్శనం కలిగింది" అంటే నమ్మలేదు. "లేదు. ఆమె ఏదో భ్రమకి లోనయ్యిందేమో? లేకపోతే ఆయన ఎవరో పశుమలై స్వామి అన్నారు కదా! ఆయన ఏమైనా చేతబడి చేసాడేమో? మామూలు మనిషికి ఈశ్వర దర్శనం అవ్వడం ఏమిటి?పైగా భగవాన్ అంటున్నారు. అలాంటి భగవాన్ లాంటి మహా పురుషులు ఒక్కసారే పుడతారు. ఎవరో కనపడి, వాళ్ళను ఆవహించడం ఏమిటి?"అని ఆ దీక్షితులుగారు నమ్మలేదు. ఆ తరువాత చలం గారు పదేపదే విజ్ఞప్తి చేసిన మీదట ఆయన అరుణాచలం వచ్చి చలం గారినీ, సౌరీస్ నీ చూసారు గానీ, అప్పటికి కూడా నమ్మకం కుదరలేదు. వెళ్లిపోయారు. తరువాత రోజుల్లో చలం గారి దగ్గరకు వస్తుండేవారు.

ఇక చలం గారి జీవితంలో ప్రధానమైన పాత్ర పోషించిన వారు లీలగారు. ఆమెకి కూడా "సౌరీస్ కి ఈశ్వర దర్శనం కలిగిందని, మేం ఈశ్వరుడి అదుపు ఆజ్ఞల్లోనే నడుస్తున్నాం"అని వుత్తరం రాశారు. "ఏమిటీ ముసలమ్మ కబుర్లు. ఇంకా మానలేదా?ఈ ముసలమ్మల భక్తిలోనే వున్నారా మీరు?" అని జవాబు రాశారు. ఆవిడ 1958 ప్రాంతాల్లో కేన్సర్ తో చనిపోయారు. ఆ విషయం కూడా ఎవరో చలం గారికి తెలియజేసారు. ఆ విషయం మిత్రులకు రాసుకున్నారు. "లీలగారు చనిపోయినట్లుగా తెలిసింది"అని.

అలాగే, చలంగారు కాకినాడలో వుద్యోగం చేసేటప్పుడు "రత్నమ్మ"అనే యువతితో పరిచయం అయిందని చెప్పుకున్నాం. చలం గారికి అరుణా చలం వచ్చిన కొద్ది నెలలకు ఒక వుత్తరం వచ్చింది "సూళ్లూరు పేట దగ్గర ఒక ట్రైన్ యాక్సిడెంట్ లో రత్నమ్మ మరణించింది."అని. అది రాసింది, రత్నమ్మ మరిది. 1928 ప్రాంతాల్లో రత్నమ్మ వివాహం చేసుకున్న దగ్గర నుంచీ, 1951లో ట్రైన్ యాక్సిడెంట్లో మరణించే వరకూ ఆ రత్నమ్మ జీవితంలో జరిగిన మిగతా సంఘటనలు మనకేమీ తెలియదు. చలం గారు మిత్రులకు రాసిన ఉత్తరాల్లో "రత్నమ్మ రైలు ప్రమాదంలో మరణించింది. ఆమె ఆఖరి ప్రియుడు మాత్రం ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. "అని రాశారు. అంత వరకే మనకు తెలుసు. ఇవి 1950-62 మధ్యలో చలంగారి కుటుంబ సభ్యులూ, మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని సంఘటనలు.

1958-59 ఆ ప్రాంతాలు వచ్చేసరికి, చలం గారి యొక్క కుటుంబమూ, పరివారమూ కూడా ఆ రమణాశ్రమ ప్రాంతాల్లో స్థిరపడ్డారని చెప్పుకోవచ్చు. జీవితంలో ఒక గాడిలో పడింది. అప్పట్లో చలంగారి దైనందిన జీవితం ఎలా ఉండేదంటే... డాక్టర్ కామేశ్వరి అనే అభిమాని అప్పుడప్పుడు అరుణాచలం వెళ్లి వస్తుండేవారు. ఆమె "నాన్నగారు చలం"అని పుస్తకం రాశారు. అందులో ఇలా వ్రాశారు – "తెల్లవారు జామున సుమారు 3,4 గంటలకు నిద్ర లేచిన దగ్గరనుండి రాత్రి 9 గంటలవరకూ కూడా నిరంతరంగా జీవితం ప్రవహిస్తూ ఉండేది. తెల్లవారు జామునే బంక మట్టి తోటి, అలాగే ఆసనాలు లాంటివి వేసేవారు. ఆ తరువాత ఓవల్టీన్ కలిపి, సౌరీస్ దగ్గరకు వెళ్లి "ఈశ్వరుడూ !" అని పిలిచి,ఆమెకు ఓవల్టీన్ ఇవ్వడం, తరువాత ఇంట్లో ఒక హాలు ఉండేది. దాన్ని "యు. ఎఫ్ "హాలు అనేవారట. అంటే , 'యూస్ లెస్ ఫెలోస్ ' హాలు అని. అంటే, 'ప్రపంచంలో పనికిరాని వాళ్ళందరూ ఆ హాలులో వుంటారు' అని. అక్కడ ఒక ఊక లాంటిది ఉంటే, దానిమీద కూర్చోవడం, సౌరీస్ వచ్చి ఆ రోజు భోజనానికి ఏం కావాలో, ఏం కూరలు చెబితే, కొంతమంది వెళ్లి, కూరలు కొనుక్కు రావడం, అందరూ కలసి కూరలు తరగడం ఇలాంటి పనులు చేసేవారు. అందరూ అన్ని పనులూ చేస్తుండేవారు. పది గంటలకల్లా అందరూ భోజనాలు చేసేసేవారు. ఆ తరువాత ఉత్తరాలు చదవడం, ఉత్తరాలు రాయడం కొనసాగేది. మధ్యాహ్నం కొంత సేపు ఆయన విశ్రాంతి తీసుకున్నాక, సాయంత్రం అందరూ కలసి, ఆ చుట్టు పక్కల వున్న కొండల్లోకీ, అరణ్యాలలోకీ షికారు వెళ్లి వస్తుండేవారు. మళ్ళా ఆరున్నరా, ఏడు గంటలకు భోజనం పూర్తి కావడం. అక్కడ నుండి 9 గంటల వరకూ భజనలు చేయడం జరిగేవి. ఆ భజనల్లో క్రిష్ణ శాస్త్రి గీతాలూ, మీరా భజనలూ ఇలాంటివన్నీ చోటు చేసుకుండేవి. సౌరీస్, చలం కూడా వాటిల్లో పాలు పంచుకునేవారు. ఆ జీవితం అంతా కూడా ఒక సమీకృత జీవన శైలి లాగ ఉండేది. సార్వజనీనక వుమ్మడి కుటుంబం అని పిలవదగినదిగా ఉండేది. ఎప్పుడూ 30 మందికి తగ్గకుండా ఉండేవారు. జాతి, మాత, కుల, భాష, ప్రాంతీయ బేధాలు ఎప్పుడూ ఉండేవి కావు. దేశ విదేశాల నుండి వచ్చిన వారు కూడా చలం గారి దగ్గర వుంటుండేవారు. అలాగే అందరూ అన్ని పనులూ చేయాలి. రేపు ఏమిటి అనే ఆలోచన అక్కడ ఉండేది కాదు. ఎవరైనా ఉత్తరాలు రాసి "మీ దగ్గరకు వస్తాం "అంటే.. చలం గారు చెప్పేవారట."రేపు ఏమవుతుంది అనేటటువంటి ఆందోళన ఉంటే గనక మా దగ్గరకు రాకండి. ఆ ఆందోళన లేని వారు మాత్రమే మా దగ్గర జీవించ గలరు."అని . అందరూ అలాగే ఉంటూ ఉండేవారు.

ప్రతి ఆదివారం అంబలి కాయించి, ఎదురుగుండా ఒక మర్రి చెట్టు ఉంటే, చలం గారు అక్కడ నిల్చొని, త్రోవలో వెళ్ళేవాళ్ళందరికీ, ఆ అంబలి పోస్తూ ఉండేవారు. చలం గారు నివసించే ఇంటి ముందో, గది ముందో ఒక సంచి వేళ్ళాడుతూ ఉండేది. దాంట్లో చిల్లర నాణేలు ఉండేవి. ఎవరైనా సరే! అందులో చిల్లర నాణేలు తీసుకొని, వచ్చిన భిక్ష గాళ్ళకి వేయవచ్చు." ఇలా ఉండేదండీ.. చలం గారూ, ఆయన కుటుంబ సభ్యుల జీవన శైలి.

ఆ జీవన శైలిని వివరిస్తూ డా.కామేశ్వరిగారు ఒక చోట ఇలా రాశారు.

"ఎక్కడ పిల్లల్ని కొట్టరో, ఎక్కడ పిట్టల్ని ఆదరిస్తారో, ఎక్కడ గొప్పతనానికి తలలువంచరో, ఎక్కడ పెళ్లి మేళాలు వినపడవో, ఎక్కడ డబ్బు పలకదో, ఎక్కడ పరుడూ, హితుడూ సమమో, ఎక్కడ ప్రేమ మౌనంలో రాజ్యం చేస్తూ ఉంటుందో, ఎక్కడ ప్రపంచపు రొద పొరపాటున కూడా వినబడదో అదే చలం గారు ఉన్నటువంటి 'రమణస్థాన్'. అక్కడ ఎన్నడో కాలం నిలచిపోయింది. వాంఛలూ, ప్రలోభాలూ శక్తి విహీనులుగా మారిపోయాయి. మనస్సుల పొంగులు చల్లారిన కొద్దీ, లోక వాసనలూ, వాంఛలూ దూరమైన కొద్ది అక్కడ నిలిచిపోయిన వారందరిలో, అక్కడ నుండి నడపబడుచున్న వారందరిలో,శాశ్వతంగా నిర్మల కాంతి చోటు చేసుకుంది"

ఆయన ఉండే ఇంటికి 'రమణ స్థాన్' అనే పేరు ఎలా వచ్చిందంటే – ఎవరో వుత్తరం రాస్తూ, 'రమణాశ్రమం' అని రాయబోయి, 'రమణస్థాన్' అని రాశారు. అప్పటి నుండి కూడా ఆయన ఉత్తరాల్లో 'రమణస్థాన్' అని రాస్తూండేవారు. 'రమణస్థాన్' అంటే చలం గారి ఇల్లు. 'రమణాశ్రమం' అంటే భగవాన్ రమణ మహర్షి ఆశ్రమం. 1960 వచ్చేసరికి చలంగారిని అందరూ 'మహర్షి' అనడం ప్రారంభించారు. చలంగారిని 'చలం మహర్షి 'అనీ, చలం గారి ఇంటిని 'రమణ స్థాన్' అనీ అనడం ప్రారంభించారు.

1958–62 మధ్యలో ఒక సంఘటన జరిగింది. 1958 లోనే చలం గారు మిత్రులకు రాసిన ఉత్తరాల్లో "నాకు ఈశ్వరుడు చెప్పాడు." (అంటే, సౌరీస్.) "1962 లో జల ప్రళయం రాబోతుంది. 8 గ్రహాలూ కలసి, అష్ట గ్రహ కూటమిగా సంభవించి, అన్నీ కలసి సముద్రంలో కలసి పోతాయి. ప్రపంచం అంతా కూడా సర్వనాశనం అయిపోతుంది. మీకు గనక రక్షణ కావాలంటే ఈశ్వరుడు దగ్గరకు రండి "అని, 58–59 నుండి అందరికీ ఉత్తరాలు రాశారు.

అయితే, ఇది సౌరీస్ చెప్పడమే కాకుండా, ప్రపంచ వ్యాపితంగా ఆరోజుల్లో కొన్ని పుకార్లు వచ్చాయి. "1962 ఫిబ్రవరి 7 వ తేదీన జల ప్రళయం" అని కేలండర్లలో కూడా వచ్చింది. అయితే, చలంగారు ఒక అడుగు ముందుకు వేసి, అక్కడక్కడా రక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చిత్తూరు లోనూ, ఇతర ప్రదేశాలలో తెలిసిన వాళ్లందరిని, వాటి నిర్వాహకులుగా నియమించి, ఆయనే డబ్బులు పంపించారు. తెలిసిన వాళ్లందరికీ "ఫలానా, ఫలానా చోట్ల కేంద్రాలు వున్నాయి. అక్కడకు వెళ్ళండి. లేకుంటే, రమణ స్థాన్ రండి " అని ఒక ఉద్యమం లాగ చేశారు. శ్రీశ్రీ గారికి కూడా ఒక వుత్తరం రాశారట. దానికి శ్రీశ్రీ గారు అన్నారట "అందరూ చనిపోయి, నేను మాత్రం ఎందుకు?అందరూ చనిపోతే నేనూ చనిపోతాను. నేను మాత్రం రాను. " అన్నారట.

62 ఫిబ్రవరి వచ్చింది. జల ప్రళయాన్ని నమ్మిన వాళ్ళందరూ రక్షణ కేంద్రాలకు వెళ్లారు. వివిధ కేంద్రాలలో ఉన్నవాళ్లందరూ బిక్కుబిక్కు మంటూ వున్నారు. ఆ కేంద్రాలు ఏర్పాటు చేసిన వాళ్లలో నూజివీడు జమిందార్ 'ఎమ్.

ఆర్. అప్పారావు గారి అబ్బాయి “విద్యుత్ కుమార్ “ కూడా వున్నాడు. అందరూ ఎదురు చూసిన రోజు వచ్చింది. వెళ్ళిపోయింది. ఏమీ జరగలేదు. యధావిధిగా ప్రపంచం నడిచింది. ప్రశాంతంగానే వుంది. అందరూ చలం గారిని నిందించారట. “మీ మూలంగా మేం ఇలా అయ్యాము. జల ప్రళయం వస్తుందనీ, అందరికీ సహాయం చేయాలనీ మా దగ్గర డబ్బులన్నీ తీసుకున్నారు.”అని. నిజానికి చలం గారు అందరి దగ్గరా డబ్బులు వసూలు చేయడం కాదు. ఆయన దగ్గర డబ్బులు అయిపోయాయి.

ఆయన కూడా ఎందుకిలా జరిగిందని వ్యాకుల పడి సౌరీస్ ని అడిగారట. “ఈశ్వరుడు ఎందుకిలా చెప్పారు. నా పరువంతా పోయింది. మీరేమో జల ప్రళయం వస్తుందని చెప్పారు. అందరూ క్షేమం గానే వున్నారు. “ దానికి సౌరీస్ నవ్వుతూ అన్నారు “ జల ప్రళయం రాలేదని రాలేదని బాధ పడుతున్నావా? దీన్ని ఈశ్వరుడే ఆపాడని అనుకోవచ్చు కదా!“ అని. మొత్తానికి చలంగారి జీవితంలో ఇది ఒక విచిత్రమైన సంఘటన లాగ మిగిలిపోయింది. ఎందుకంటే, ఈ మూఢ నమ్మకాలన్నిటికీ వ్యతిరేకంగా పెరిగిన వ్యక్తి. తరవాత రమణ మహర్షిని నమ్మారు. జలప్రళయాన్ని తాను నమ్మడమే కాకుండా, ఒక ఉద్యమం లాగ చేశారు. అందుకే ఇది కొంచెం హాస్యాస్పదంగా అనిపించింది చాలామందికి

ఇక్కడ నుండి ప్రారంభించి మరొక పది సంవత్సరాలు అంటే, 1962-72 మధ్యలో జరిగినటు వంటి ముఖ్య సంఘటనల్లో ఒకటి చలంగారి భార్య రంగనాయకమ్మ గారి మరణం. అది ఎలా జరిగిందంటే..

పకపకా, వజీర్ రహ్మాన్ ల వివాహం జరిగిన 1959 లోనే ఆమె అరుణా చలం నుండి కాకినాడ వెళ్లిపోయారని గతంలో తెలుసుకున్నాం. వజీర్ రహ్మాన్ ది కాకినాడే కాబట్టి, పకపకా, వజీర్ రహ్మాన్ అప్పుడప్పుడు కాకినాడ వెళుతుండేవారు. అలా వెళ్ళేటప్పుడు రంగనాయకమ్మ గారి దగ్గరకు వెళ్లి, “అరుణాచలం వెళ్ళిపోదాం రమ్మన”మని అడిగేవారు. కానీ, ఆమె ఏమాత్రం పట్టు వీడలేదు. 1967-68 వరకూ ఆమె అరుణాచలం వైపు కన్నెత్తి చూడలేదు. తరువాత – పకపకా, వజీర్ రహ్మాన్ లకు ఒక పాప పుట్టింది. ఆ పాపని “టిప్పు”అని పిలిచేవారు. అసలు పేరు ‘షరీన్’. ఆ పాప జననం కూడా అరుణాచలంలో చలం గారి ఇంట్లోనే జరిగింది. ఆ పాపని తీసుకొని కాకినాడ వెళ్లారు. ఆ పాపని చూశాక రంగనాయకమ్మ గారి మనసు మారి, తన పంతాలూ, పట్టింపులూ వదిలేసి, పకపకా, వజీర్ రెహ్మాన్ లతో అరుణాచలం బయలుదేరారు. 7,8 సంవత్సరాల తర్వాత మళ్ళీ అరుణాచలం అదే వెళ్లడం.

అయితే, రంగనాయకమ్మ గారు కాకినాడలో ఉండగానే మైల్డ్ గా ‘హార్ట్ ఎటాక్’ వచ్చింది. ఇలా హార్ట్ ఎటాక్ వచ్చిందని తెలిసి, అరుణాచలం వెళ్ళాక అందరూ జాగ్రత్తగా చూసుకున్నారు. అక్కడ ఒక చిన్న సంఘటన జరిగింది. చిత్రా పాప ‘మిస్సీ’ వుంది కదా! ఆ పాప రంగనాయకమ్మ గారి చీర మీద ‘ఉమ్మి’ వెయ్యడం లాంటిది ఏదో జరిగింది. అది చాలా చిన్న సంఘటనే. దానికి రంగనాయకమ్మ గారు చాలా బాధపడ్డారు. అప్పుడు కూడా ఆవిడకు మతి

స్థిమితం ఒక్కోసారి సరిగ్గా ఉండేది కాదు. ఆవిడ అలిగి అరుణా చలం నుండి మళ్ళీ కాకినాడ వెళ్లిపోయారు. అందరూ అన్నారట"ఇంత చిన్న విషయానికి అలిగి వెళ్ళిపోతావేమిటి? కావాలని వచ్చేవు. ఆరోగ్యం కూడా సరిగ్గా లేదు. " అని సర్ది చెబుతున్నా వినలేదు. కాకినాడ వెళ్ళాక మళ్ళీ హార్ట్ ఎటాక్ వచ్చింది. రంగనాయకమ్మ గారు అక్కడ నుండి తనంతట తానుగా బెజవాడ వెళ్లిపోయారు.

బెజవాడలో 'రాజ్యం'అనే ఆమె గవర్నమెంట్ హాస్పటల్లో నర్సుగా వుద్యోగం చేస్తున్నారు. రంగనాయకమ్మ గారి అక్కయ్య డాక్టర్ రంగనాయకమ్మ గారికి దూరపు బంధువు ఈ రాజ్యం. 'ఆవిడ దగ్గరకు వెళ్తే, అవసరమైతే, ఏమైనా వైద్యం చేస్తుంది' అనుకొని ఆ రాజ్యం దగ్గర వున్నారు చలంగారి భార్య రంగనాయకమ్మగారు. ఆమె కొన్నాళ్ళు రంగనాయకమ్మగారిని బాగా చూసుకున్నారు. తరవాత రాజ్యమే అరుణా చలం వుత్తరం రాసింది. "మీరు ఎవరైనా రండి. నేను రోజూ హాస్పిటల్ కి వెళ్ళడం, ఈమెను చూసుకోవడం ఇబ్బందిగా వుంది " అని. అప్పుడు నర్తకి వచ్చి, ఒక అమ్మాయిని బెజవాడలో ఉంచి, రంగనాయకమ్మ గారిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి, వెనక్కి వెళ్ళిపోయింది.

అలా కొన్ని రోజులు గడిచాక, ఈ రాజ్యం, రంగనాయకమ్మ గారిని బెజవాడ నుండి అరుణాచలం తీసుకువచ్చింది. "ఈవిడకు ఇంకా జబ్బు పెరిగేటట్లు వుంది. అప్పుడప్పుడు గుండె పట్టేస్తోంది అంటుంది. నేను చేయగలిగినంత చేస్తున్నాను. కానీ, మీదగ్గర ఉంటే మంచిదని తీసుకువచ్చాను" అని అప్పగించింది. అది సుమారుగా 1969 జనవరి-ఫిబ్రవరి ప్రాంతాలలో. అక్కడనుండి దాదాపు సంవత్సరం పాటు అరుణాచలం లోనే ఉన్నారు. ఆరోజుల్లో ఆమెకు ఆరోగ్యం తగ్గుతూ వస్తోంది. ఉన్నట్టుండి 'నాకు గుండె పట్టేస్తోంది. ఊపిరి ఆడడం లేదు. " అంటూ ఉండేవారు. అలాంటప్పుడు సౌరీస్ ఇంజక్షన్లు ఇస్తుండేవాళ్ళు. వాళ్లకు కూడా సరిగ్గా అర్థమయ్యేది కాదు – ఒక్కోసారి మతి సరిగ్గా ఉండదు కదా! ఈవిడ తెలిసి అంటున్నదా, తెలీక అంటున్నదా? అని.

ఇలా ఆరోగ్యం దిగజారుతున్నటువంటి ఆ రోజుల్లో కొన్ని సార్లు మంచం మీదే పడుకొని వున్నప్పుడు, ఎవరైనా ఏమైనా తినడానికి ఇస్తే, చలంగారిని పిలిచి, అతన్ని తినమని బలవంతం చేసేవారు. చలం గారికి ఇష్టం లేకపోయినా, ఆమెని నిరాశపరచడం ఇష్టం లేక, తింటుండేవారు. ఆ సందర్భాన్ని సౌరీస్ తన జీవిత చరిత్రలో రాసుకున్నారు. "అమ్మా, నాన్నా ఇంత ప్రేమగా ఉండడం చూడడం ఇదే మొదటిసారి. నిజానికి అమ్మకీ, నాన్నకీ ఒకరంటే ఒకరికి చాలా ప్రేమ ఉండేది. బయటకు మాత్రం భిన్నమైన అభిప్రాయాల తోటీ, అనుభవాల తోటీ విడివిడిగా ఉన్నట్లు అనిపించేవారు. కానీ, వాళ్ళిద్దరి మధ్యా ఆత్మ సంబంధమైన ప్రేమ యెంత వున్నది అనేది ఇదిగో ఇలాంటి దృశ్యాలు చూసినప్పుడే మాకు తెలిసింది."అని.

అలా 1969 చివరికి వచ్చేసరికి ఒక రోజు ఆమెకు దాదాపుగా గుండె ఆగిపోయినంతగా అయ్యింది. ఆ రోజు ఆమె వరండాలో కూర్చున్నారు. అందరూ లోపల ఉన్నరు. ఉన్నట్టుండి రంగనాయకమ్మగారు కింద పడిపోయారు.

వారి కుటుంబానికి బాగా కావలసిన మనిషి, డాక్టర్ కామేశ్వరి గారు అక్కడే వున్నారు. ఆమె వెళ్లి చూశారు. పల్స్ అందడం లేదు. దాదాపుగా గుండె ఆగిపోయినంత పరిస్థితి. ఆగిపోయిందనే అనుకున్నారు. ఆవిడ ఇంజక్షన్లు వెతుకుతున్నారు. 4,5 నిముషాల్లో తేరుకుని మళ్ళీ మామూలు మనిషయ్యారు. దాదాపు మరణం అంచుల వరకూ వెళ్లి, వెనక్కి వచ్చారు. "ఈశ్వరుడే బ్రతికించాడు" అనుకున్నారందరూ. ఇదంతా 69 అక్టోబర్-నవంబర్ ప్రాంతాల్లో జరిగింది. అక్కడ నుండి మరో 2 నెలల తర్వాత 1970 జనవరిలో రంగనాయకమ్మ గారి చివరి రోజులు దగ్గరయ్యాయి. ఆమె సౌరీస్ తో చెప్పారట "నాకు ఎప్పుడైనా మరణం సంభవిస్తే, నీ కళ్ళలోకి చూస్తూ పోవాలని వుంది. నువ్వు నాకు ఆరోగ్యం బాగున్నప్పుడు దగ్గర కూర్చొని మీరా భజనలు పాడుతూవుండు. ఒక వేళ నేను అపస్మారక స్థితిలో వున్నా గానీ, నా కళ్ళు తెరువు. ఎలాగైనా గానీ, నీ మొహం చూస్తాను. నీ మొహం చూస్తూ పోవాలని వుంది. " అని.

ఇంకో విచిత్రం ఏమిటంటే, రంగనాయకమ్మ గారు చిట్టచివరి రోజుల్లో భగవాన్ పేరు తలచేవారు కాదట. కావాలని తనంతట తానుగా భగవాన్ దగ్గరకు వచ్చి, ఒంటరిగా ఉండి, అలాగే భగవాన్ ని అన్నీ తినమని చెప్పి, భగవాన్ అంటే, ఎంతో ప్రేమతో ప్రార్ధనలు చేసినటు వంటి వ్యక్తి. ఎందుకో గానీ, చిట్టచివరి రోజుల్లో "సదా శివుడు" అంటుండేవారట. పరమ శివుడి ప్రార్ధన చేస్తూండేవారట. ఇదంతా సౌరీస్ రాసారు. మరి ఎందుకలా చేశారో తెలియదు. కొంత కాలం బాగుంటే, కొంత కాలం బాగుండేది కాదు. చివరికి ఆ రోజు రానే వచ్చింది. 1970 జనవరి. ఆరోజు సాయంకాలం. ఆమెకు ఇష్టమైన పాటలు పెట్టారు. ఆరోగ్యం దిగజారుతూ వచ్చి, దాదాపు అపస్మారకం వున్నారు. సౌరీస్ ఆమె పక్కన కూర్చున్నారు. ఆమెకు చివరి క్షణాలు సమీపించాయి అన్నట్లుగా అందరికీ తెలిసిపోయింది. అంతలోనే కళ్ళు తేలేసారు. శరీరం అంతా కూడా బిర్ర బిగుసుకు పోయింది. శరీరం నుండి ప్రాణాలు పోయాయి.

అది చివరిసారిగా సౌరీస్ చేతుల మీదుగా తల్లి రంగనాయకమ్మ గారు ప్రాణాలు వదిలిన సందర్భం. చిన్న కూతురు'నిర్మల'ని చూడాలని ఉండేదట. "నిర్మలకి కబురు చెయ్యి. "అనే వారట. కానీ, ఆవిడ కారణాంతరాల వల్ల రాలేకపోయారు. చలంగారు వరండాలో వున్నారు. సౌరీస్ బయటకు వచ్చి, "నాన్నా! అమ్మ చనిపోయింది. "అని చెప్పారట. అప్పుడు చలంగారు ఉన్నట్టుండి ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడ్చారు. మరి ఆయన మనసులో ఎన్ని జ్ఞాపకాలు, ఎన్ని అనుభవాలు, ఎన్ని కష్టాలు, ఎన్ని గతాలు గుర్తుకు వచ్చాయో గాని "భార్య చనిపోయింది" అనగానే, ఆయన ఏడ్చినటువంటి సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సౌరీస్ చెప్పారు "ఎప్పుడూ నాన్న ఇంతగా ఏడ్వడం చూడలేదు. అసలు నాన్న కళ్ళ వెంట నీళ్లు వస్తాయా? అనుకునే వాళ్లం. అలాంటిది అమ్మ చనిపోయింది అని తెలియగానే, ఇంతగా బాధ పడ్డారు. "అని.

ఆ మర్నాడు రంగనాయకమ్మ గారి అంతిమ యాత్ర ప్రారంభమయ్యింది. ఆ చివరి యాత్ర జరిగిన సందర్భాన్ని సౌరీస్ రాసిన వాక్యాలలోనే.... "అమ్మ పాదాలకి పచ్చని పసుపు రాసింది చిత్ర. అమ్మ ముఖాన ఎర్రని కుంకుమ బొట్టు పెట్టింది నర్తకి. అమ్మ జుట్టు ముడివేసి గులాబి పూలు పెట్టారు. అమ్మ దేహాన్ని పాడె మీద పడుకోబెట్టారు. అమ్మ మెడలో పెద్ద సన్నజాజిపూల దండ వేసింది నర్తకి. "జూడి "అనే అమ్మాయి ఎర్రని మందారాలు తెచ్చింది. నర్తకి వేసిన జాజిపూల మాల నడుమ, మందార పూలని గుచ్చింది. అలంకారాలతో అమ్మ ఎంతో ఠీవిగా వుంది. ముక్కూ, మొహం తెలియని బ్రాహణుని ఎవరినో కొడుకుగా పెట్టడం ఇష్టం లేదు "షౌ"కి." కష్ట సుఖాలన్నిటి లోనూ 'రమణ స్థాన్ ' తోడుగా నిలచిన, అమ్మ పుత్ర వాత్యల్యాన్ని చూరగొన్న 'క్రిష్ణారావు'. ఆయనే చిక్కాల కృష్ణారావు. ఆయన్నే కొడుకుగా ఉండమన్నారు 'షౌ'.

గొప్ప ఎమోషన్ లో వణికి పోతూ సౌరీస్ తల్లి పాదాలకు నమస్కారం చేశారు. కృష్ణారావు గారు నిప్పుకుండా చేత బట్టి ముందుకు నడిచారు. పాడెను తీసుకువెళుతుంటే, అమ్మ దేహం చెక్కు చెదరలేదు. అమ్మ ముఖంలో ప్రేత కళ లేదు. అంతిమ యాత్రలో చిత్రా, నర్తకీ చేసిన అలంకారాలతో ఎంతో ఠీవిగా పుట్టెడు పసుపు కుంకుమలతో పుణ్య మూర్తిగా వెళ్ళిపోయింది అమ్మ. ఆ పాడె వెళుతుంటే, ఏదో పెళ్లి ఊరేగింపులో అమ్మ వెళుతుందని చూసేవారికి అనిపించింది. ఎదురుగుండా నిరామయంగా అరుణా చలం. ఇంటి వరండాలో చలం."

ఆమె అస్తిత్వం కోసం, వ్యక్తిత్వం నిలుపుకోవడం కోసం, స్వంత కాళ్ళ మీద నిలబడడం కోసం, జీవితమంతా పోరాటం గడిపి వ్యక్తి చలం గారి భార్య రంగనాయకమ్మ గారు. ఆ విధంగా 1970లో కన్నుమూశారు. ఆ తరువాత ఆమె స్వగ్రామం బెజవాడ కాబట్టి, తీసుకువెళ్ళడానికి కొన్ని అస్థికలు పక్కన పెట్టారు. మిగతా అస్థికలతో చలం గారి ఇంటి ముందు ఒక సమాధి కట్టించారు. ఆ సమాధి పక్కనే కూర్చోవడానికి ఒక అరుగు లాంటిది కడుతుంటే, చలం గారు నవ్వుతూ అన్నారట "కొంచెం దూరంగా కట్టండి. ఒకవేళ దగ్గరగా ఉంటే మేం మళ్ళీ పోట్లాడుకుంటామేమో. "అని. అది హాస్యాస్పదంగా అన్న మాటే గానీ, చలంగారికీ, భార్య గారికీ ఉన్నటువంటి ప్రేమ ఆ చివరి రోజుల్లో తెలిసింది. చలంగారి చివరి రోజుల్లో ఒక అధ్యాయం ముగిసింది. ఇక్కడ నుండి అంటే 1970–79 వరకూ ఏం జరిగిందో తరవాత భాగంలో తెలుసుకుందాం...

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఏప్రిల్ 23 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS